క్లుప్తంగా

వేతనం పెంచాలని డిమాండ్

కపిలేశ్వరపురం: అంగన్‌వాడీల వేతనాన్ని రూ.26వేలకు పెంచాలని డిమాండ్‌చేస్తూ మంగళవారం కపిలేశ్వరపురంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కపిలేశ్వరపురం, ఆలమూరు, మండపేట, కె.గంగవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. నాయకులు ఎం.బేబీ, ఎం.జానకిదేవి సీహెచ్.రాణి, ఎం.మంగాదేవి, జి.వీరలక్ష్మి, ఎం.వెంకటరత్నం, కె.కుమారి మాట్లాడుతూ ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను పెంచాలని కోరారు. వినతిపత్రాన్ని సీడీపీఓ అధికారి గజలక్ష్మికి అందజేశారు.

ఆడబిడ్డని కాపాడుకుందాం



పడమర ఖండ్రికలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: ఆడబిడ్డను కాపాడుకుందాం నినాదంతో మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీలు, మానవహారం చేపట్టారు. వారినుద్దేశించి హెచ్‌ఈ బి.రామారావు, పాఠశాల హెచ్ఎంలు మాట్లాడుతూ ఆడబిడ్డను కాపాడుకోవడం సృష్టి ధర్మమన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదన్నారు.

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రిపబ్లిక్ డే

రామచంద్రపురం రూరల్: గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం రామచంద్రపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావలసిందిగా కోరారు.

26న ఉచిత సామూహిక అక్షరాభ్యాసం

మండపేట: వసంత పంచమి సందర్భంగా మండపేట న్యూకాలనీలోని వాణివిద్యావిహార్‌లో 26వ తేదీన ఉచిత సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు వల్లూరి విజయానంద పార్థసారధి తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న వాణి విద్యావిహార్‌ను భారతీయ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో మండపేటలో పునః ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. గురువారం స్కూల్ ఆవరణలో నిర్వహించే కార్యక్రమంలో తల్లిదండ్రుల పాల్గొని తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించుకోవాలని కోరారు.

నేడు వెంటూరులో గడప గడపకూ మన ప్రభుత్వం

రాయవరం: మండలంలోని వెంటూరులో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో డి.శ్రీనివాసు మంగళవారం విలేకరులకు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మండపేట: పట్టణంలోని సత్యశ్రీరోడ్డులో గల శ్రీదుర్గా గణపతి ఆలయం పునర్నిర్మాణం నేపథ్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా జరుగుతున్నాయి. 26వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ జరుగనుంది. అందులో భాగంగా వేద పండితులు త్రిమూర్తిశర్మ, ఆలయ పూజారి రెడ్డి వాసు పర్యవేక్షణలో సోమవారం నుంచి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి నవగ్రహారాధన, మంటపారాధన, చండీ హోమం చేశారు. కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

డిమాండ్లను పరిష్కరించాలి

రాయవరం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాయవరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల అసోసియేషన్ రాయవరం ప్రాజెక్టు కార్యదర్శి డి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ప్రాజెక్టు పీవో వరాహలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సెక్టార్ లీడర్స్ సూర్యకుమారి, దుర్గ, కమల, వెంకటలక్ష్మి, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

ప్రజాస్వామిక ఆయుధం ఓటు

- రెండు నియోజకవర్గాల్లో 4,14,285 మంది ఓటర్లు
- పురుషులు 2,04,485, స్త్రీలు 2,09,790, ఇతరులు 10
- నేడు 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం
- పోలింగ్ బూత్ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు



2019 సార్వత్రిక ఎన్నికల్లో టేకి పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూ కట్టిన మహిళలు

కపిలేశ్వరపురం/రాయవరం: ఓటు ప్రజాస్వామ్యానికి పునాది. ప్రజల భాగస్వామ్యంతో ప్రజలు మెచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే మార్గం ఓటు... ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు నచ్చిన నేతను పరిపాలకుడిగా ఎన్నుకునే వీలు రాజ్యాంగం కల్పించింది. 74వ గణతంత్ర దినోత్సవం రోజుకు ఒక్కరోజు ముందు 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపకోనున్నాం.

ఓటరు దినోత్సవ నేపథ్యమిదీ..

ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రెవెన్యూ తదితర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే ఓటర్ల దినోత్సవం ప్రాధాన్యం గలది. గతంలో ఏడాదికొకసారి ఓటర్ల జాబితాను సవరణ చేసేవారు. 2022లో ఎన్నికల సంఘం ఆదేశం మేరకు జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో నాలుగు సార్లు ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ ప్రక్రియను నిర్వహించారు. అర్హత గల ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. 17 ఏళ్ల నిండినవారు సైతం దరఖాస్తు చేసుకునే వీలు కల్పించగా వారికి 18 ఏళ్లు నిండాక ఓటుహక్కు కల్పిస్తారు.

రెండు నియోజకవర్గాల్లో ఓటర్లు ఇలా..

రామచంద్రపురం నియోజకవర్గంలో ఒక పట్టణం, మూడు మండలాలు ఉండగా పురుషులు 99,602, స్త్రీలు 99,886, ఇతరులు ఏడుగురు మొత్తం 1,99,495 మంది ఓటర్లు ఉన్నారు. మండపేట నియోజకవర్గంలో ఒక పట్టణం, మూడు మండలాలు ఉండగా పురుషులు 1,04,883 మంది, స్త్రీలు 1,09,904, ఇతరులు ముగ్గురు మొత్తం 2,14,790 మంది ఉన్నారు. రెండు నియోకవర్గాల పరిధిలో 4,14,285 మంది ఓటర్లున్నారు. పురుషుల కంటే 5,305 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

ఈ ఏడాది ఇలా...

13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 25న ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోనూ కొత్త ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించి నూతన ఓటరు గుర్తింపు కార్డును అందజేస్తారు. సీనియర్ సిటిజన్లను సత్కరిస్తారు. మధ్యాహ్నం 1 గంట తర్వాత పాఠశాలలు, కళాశాలల వద్ద విద్యార్థులకు 'మై భారత్ హూ' అనే హిందీ పాటను వినిపించనున్నారు. ముగ్గులు, వ్యాసరచన పోటీలను నిర్వహించి అదే రోజు బహుమతులను ఇవ్వనున్నారు.

మండలాల వారీగా ఓటర్లు ఇలా...

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
రామచంద్రపురం టౌన్	16,,737	17,908	03	34,648
రామచంద్రపురం(రూ)	28,591	28,561	02	57,154
కాజులూరు	28,059	27,747	00	55,806
కె.గంగవరం	26,215	25,670	02	51,887
మండపేట టౌన్	22,199	24,590	01	46,790
మండపేట రూరల్	30,660	32,199	01	62,860
రాయవరం	25,905	26,869	01	52,775
కపిలేశ్వరపురం	26,119	26,246	00	52,365
మొత్తం	2,04,485	2,09,790	10	4,14,285



ఓటరు జాబితా

ప్రతి ఎన్నికల్లో ఓటు వేస్తున్నాను



ఆలయ శిల్పాల పనిచేసే నేను ఓటు విలువను గుర్తించాను. ఓటు వచ్చిన నాటి నుంచి నేటి వరకూ జరిగిన వివిధ స్థాయిల్లోని ప్రతి ఎన్నికల్లోనూ ఓటు వేశాను. పనికి ఎంత దూరమెళ్లినా ఎన్నికల సమయానికి వచ్చి ఓటు వేసేవాణ్ణి. ఆ బాధ్యతతోనే రెండుసార్లు వార్డు సభ్యునిగా ఎన్నికై గ్రామానికి సాధ్యమైనంత సేవ చేశాను.

– పెద్దింశెట్టి నాగేశ్వరరావు, అంగర, కపిలేశ్వరపురం మండలం

నేడు ప్రత్యేక కార్యక్రమాలు



జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటు హక్కుపై అవగాహన, చైతన్యం కల్పించేందుకు పోలింగ్ బూత్‌ల వద్ద, తహసీల్దారు కార్యాలయాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సీనియర్ ఓటర్లను సత్కరించడంతో పాటుగా, కొత్తగా ఓటుహక్కు పొందిన వారికి గుర్తింపు కార్డులు జారీ చేస్తాం.

– కేజే ప్రకాష్‌బాబు, తహసీల్దారు, రాయవరం

ఏఓకి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి



వేదవల్లిని అభినందిస్తున్న ఆర్డీవో సింధూ సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం: రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న కె.వేదవల్లికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆర్డీవో పి. సింధూ సుబ్రహ్మణ్యం వేదవల్లికి అభినందనలు తెలియజేస్తూ పట్టుదల, కృషి, అంకిత భావంతో పని చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని అన్నారు. కార్యాలయం సిబ్బంది వేదవల్లికి అభినందనలు తెలియజేశారు.

ఆర్డీఓ కార్యాలయ ఏఓగా భాస్కర్



రామచంద్రపురం రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా టీవీ భాస్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏఓగా బాధ్యతలు స్వీకరించిన కె.వేదవల్లి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందడంతో భాస్కర్‌ను ఇన్‌చార్జిగా ఉన్నతాధికారులు నియమించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



మండపేట మండలంలో ఇళ్ల నిర్మాణంపై సమీక్షిస్తున్న అధికారులు

మండపేట: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పక్కా ఇళ్ల నిర్మాణ పనులను మండలంలో వేగవంతానికి సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా యానిమేటర్లు కృషి చేయాలని ప్రత్యేకాధికారి ఒ.రామకృష్ణ సూచించారు. మండలంలో ఇళ్ల నిర్మాణ ప్రగతిపై మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఐ.రాజు అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ టి.రాజేశ్వరరావు, హౌసింగ్ ఏఈ దాసు, వెలుగు ఏపీఎం రవిరాజు హాజరయ్యారు. ప్రస్తుతం బిలో బేస్‌మెంట్ లెవెల్‌లో 1,800 ఇళ్లు ఉన్నాయని, ప్రభుత్వం అందిస్తున్న సాయం గురించి లబ్ధిదారులకు వివరించి వాటిని బేస్‌మెంట్ లెవెల్‌కు తీసుకువచ్చేందుకు కృషిచేయాలన్నారు. బేస్‌మెంట్, రూఫ్ లెవెల్‌లో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసేందుకు లబ్ధిదారులతో మాట్లాడాలన్నారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న గృహనిర్మాణ లబ్ధిదారులకు రూ.35 వేలు ఆర్థిక సాయం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డ్వాక్రా వీఓఏలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ల ర్యాలీ రేపు



ర్యాలీ వాల్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న రాజుబాబు తదితరులు

కాజులూరు: ఆల్ ఇండియా రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం జరుగనున్న దేశవ్యాప్త ట్రాక్టర్ల ర్యాలీని రైతులు, ప్రజలు విజయవంతం చేయాలని జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. రైతు సంఘాల నాయకులు మంగళవారం మండల గ్రామాలలో పర్యటించి ట్రాక్టర్ల ర్యాలీపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలు, వాల్‌పోస్టర్లు పంచారు. కాజులూరు ఏగులమ్మ గుడి వద్ద జరిగిన సభలో రాజబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను ప్రతిఘటిస్తూ ఢిల్లీ కేంద్రంగా ఏడాదిపాటు ఆందోళనలు చేయడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి వాటిని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. రైతుల దీక్ష విరమింపజేసి ఏడాది గడుస్తున్నా కేంద్రం హామీలు అమలు చేయకపోవటంతో దేశవ్యాప్తంగా ట్రాక్టర్ల ర్యాలీతో నిరసన తెలుపుతున్నామన్నారు. 26వ తేదీ కాకినాడలో జరిగే ర్యాలీలో రైతులు పాల్గొనాలన్నారు. సంఘ నాయకులు కుడుపూడి భూచక్రం, నామ చంద్రరావు, వనుం వీరబ్రహ్మం, జక్కే శ్రీనివాసు పాల్గొన్నారు.

ఏడిద రోడ్డుకు మరమ్మతులు

తీరనున్న ప్రయాణికుల కష్టాలు



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం, వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: ప్రమాదభరితంగా ఉన్న మండపేట – ఏడిద రోడ్డు మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాజమహేంద్రవరం, కడియం నర్సరీల ప్రయాణికులు, వాహనాలతో మండపేట–ఏడిద రోడ్డులో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. ఇప్పటికే రోడ్డు గోతులతో ప్రమాద భరితంగా ఉంది. ద్వారపూడి రోడ్డు అభివృద్ధి పనుల నేపథ్యంలో రాజమహేంద్రవరం ట్రాఫిక్‌ను ఏడిద, కడియం మండలం దుళ్ల మీదుగా మళ్లించారు. దీంతో రోడ్డులో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోవడంతో ఎక్కడికక్కడ గోతులతో రోడ్డు మరింత ప్రమాదభరితంగా తయారైంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమస్యపై ఉన్నతాధికారులతో మాట్లాడి అత్యవసర మరమ్మతులకు రూ. 40 లక్షలు మంజూరు చేయించారు. సంక్రాంతి పండగలకు ముందే పనులు ప్రారంభించాలని భావించినప్పటికి ద్వారపూడి రోడ్డు పనుల దృష్ట్యా జాప్యమైంది. మూడు రోజుల క్రితం ఆర్అండ్‌బీ అధికారులు పనులు ప్రారంభించారు. పనులను మంగళవారం ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైఎస్సార్ సీపీ నాయకులు పలివెల సుధాకర్, బూరిగ జానీ, తాతపూడి రాజేష్ పరిశీలించారు. ఆర్అండ్‌బీ జేఈ సూర్యనారాయణ మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అప్‌గ్రేటెడ్ టెక్నాలజీతో రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరయ్యాక పనులు చేస్తామన్నారు.

వైభవంగా పోలమాంబ జాతర



అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరిన భక్తులు

రాయవరం: స్థానిక పోలమ్మతల్లి జాతర కొప్పువెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామునుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. కోరిన కోర్కెలు నెరవేరాలని, పాడిపంటలు, పిల్లాపాపలను చల్లగా చూడాలని కోరుతూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఆరు గంటల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి పోటెత్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటుగా పశ్చిమ, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. కొప్పువెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నౌడు వెంకటరమణ ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండపేట సీఐ శివగణేష్ పర్యవేక్షణలో రాయవరం, మండపేట టౌన్, మండపేట రూరల్, రామచంద్రపురం, కె.గంగవరం ఎస్సైలు నేతృత్వంలో 80 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఎన్.వెంకటరమణ, ఏఎంసీ డైరెక్టర్ తేతల సుబ్బరామారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. తీన్‌మార్, బ్యాండుమేళాలు, గరగనత్యాలు, కోబ్రా డ్యాన్సు, సంగీత విభావరి అలరించాయి. డైనోసార్, ఎలుగుబంటి, శక్తివేషాలు, భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ, మిరుమిట్లు గొలిపే బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



రజత కిరీట ధారియై..గజమాలతో పోలమ్మతల్లి అమ్మవారు

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కాజులూరు విద్యార్థిని



సాయిదుర్గా ప్రసన్నను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాజులూరు: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కాజులూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఎ సాయిదుర్గా ప్రసన్న ఎంపికయ్యింది. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో స్కూల్ పీడి రవి సుందర్ కౌర్ మాట్లాడుతూ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీలలో తాడేపల్లిగూడెంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–14 ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు తమ పాఠశాలకు చెందిన ముగురు విద్యార్థులు హాజరుకాగా వీరిలో సాయిదుర్గాప్రసన్న ప్రతిభ కనపరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయిందన్నారు. మార్చి లేదా ఏప్రిల్‌లో చెన్నైలో జరుగనున్న జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో సాయిదుర్గాప్రసన్న రాష్ట్ర టీమ్ తరఫున పోటీపడనుందన్నారు. ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు.

పెన్షన్ ఫిర్యాదుపై డీఆర్‌డీఏ పీడీ వరప్రసాద్ విచారణ



విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ

రాయవరం: తమకు మంజూరైన పెన్షన్లు ఇవ్వడం లేదంటూ మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన పెన్షనర్లు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జ్యోతిలక్ష్మి మంగళవారం గ్రామంలో విచారణ నిర్వహించారు. జనవరి నెలలో తమకు నూతన పింఛన్లు మంజూరైనప్పటికీ పెన్షన్ సొమ్మును చెల్లించడం లేదంటూ 10 మంది ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసిన అధికారులు వాస్తవ పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని పీడీ శివశంకరప్రసాద్ తెలిపారు. విచారణాధికారుల వెంట ఎంపీడీవో డి.శ్రీనివాసు ఉన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ



జక్కంపూడి, దోసారావు విగ్రహాలకు భూమిపూజ చేసిన సర్పంచ్ ఆరిఫ్, స్థానిక నేతలు

రాయవరం: దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు, సోమేశ్వరం మాజీ సర్పంచ్ దివంగత నిమ్మకాయల దోసారావు విగ్రహాలను మండలంలోని సోమేశ్వరంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ ఆరిఫ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఆరిఫ్ మాట్లాడుతూ జక్కంపూడి రామ్మోహన్‌రావు మంత్రిగా రాష్ట్రానికే కాకుండా జిల్లా అభివృద్ధికి సేవ చేశారన్నారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడిగా నిమ్మకాయల దోసారావు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. వారి సేవలను గుర్తు చేసుకుంటూ విగ్రహాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ధూళిపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై చైతన్యం పెరగాలి



వైద్యులను సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ నాయకులు

మండపేట: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా పీఎంపీలు కృషిచేయాలని మండపేట జానకిరామ హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.జానకిరామ్ అన్నారు. సీజనల్ వ్యాధులపై మండపేట పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోన సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన అవగాహన సదస్సుకు జానకిరామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శీతాకాలంలో దోమలు, ఈగల వల్ల వైరస్, బ్యాక్టీరియా వ్యాప్తి చెంది టైఫాయిడ్, డెంగీ, మలేరియా, డయేరియా, ఫైలేరియా, మెదడు వాపు తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. సీజనల్ వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి త్వరితగతిన చికిత్స అందేలా పీఎంపీలు చూడాలన్నారు. వైద్యులు అమూల్య భావన, ఉమ, అశ్విని సీజనల్ వ్యాధులపై వివరించారు. అనంతరం వైద్యులను సత్కరించారు. కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు హాజరయ్యారు.

విద్యార్థుల అపూర్వ కలయిక



అప్పటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

కాజులూరు : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వపు విద్యార్థులు సందడి చేశారు. 1980–1981 సంవత్సరంలో 10వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు సమావేశమై విందు, వినోదాలతో ఉత్సాహంగా గడిపారు. ఆనాటి సంగతులను నెమరువేసుకున్నారు. అనుభవాలను పంచుకున్నారు. కుటుంబ సమేతంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ పాఠశాలలోనే ఆనందంగా గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తగదంటూ ధర్నా

కొత్తపేట: ఎందరో ప్రాణ త్యాగాల ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ నుంచి పరిరక్షించుకునేందుకు సమైక్య ఉద్యమాన్ని తీవ్రతరం చేయవలసిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర సీపీఐ కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని దశల వారీ ఉద్యమంలో భాగంగా మంగళవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం వద్ద సీపీఐ–ఏఐటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తగదంటూ చేపట్టిన ఉద్యమంలో భాగంగా నేడు ఆర్‌డీఓ కార్యాలయాల వద్ద, బుధవారం కలెక్టరేట్‌ల వద్ద నిరాహార దీక్షలు, 31న విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద లక్షమందితో ఆందోళన చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల శాఖ కార్యదర్శి మోకా హేమ, జిల్లా, మండల శాఖల ప్రతినిధులు వి.శ్యామ్, కర్రి రామిరెడ్డి, కె.శ్యామ్, ఏఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.